
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 4 ఫిబ్రవరి 2024



తెలంగాణ ఎన్టీపీసీ రెండో యూనిట్ ట్రయల్ రన్ సక్సెస్ 6లో..

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం 8లో..

పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం
పోటాపోటీ



- కాంగ్రెస్‌లో పెరిగిన ఆశావహులు
- ఎనిమిది మందికి పైగా దరఖాస్తు
- ఎవరికి వారుగా ముమ్మర యత్నాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం నుంచి పోటీ చేయాలనుకునే వారి సంఖ్య పెరుగుతోంది. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ ఎన్నికల్లోని ఏడు సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడంతో ఎంపీ టికెట్‌కు డిమాండ్ పెరిగింది. టికెట్ దక్కిదే గెలుపు నల్లేరు మీద నడకేనని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కొత్త నాయకులు తమకు టికెట్ కావాలంటూ తెరమీదకు వస్తున్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. జనరల్ స్థానాలకు దరఖాస్తు చేసుకునేందుకు 50 వేలు, రిజర్వుడ్ స్థానాల్లో దరఖాస్తుకు 25 వేల రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. దీంతో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి తమకు టికెట్ ఇవ్వాలంటూ పలువురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ కార్యదర్శి గొమాసే శ్రీనివాస్, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ సీహెచ్ సుగుణ కుమారి, గడ్డం వంశీకృష్ణ, యూత్ కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్, యువ నాయకుడు పెర్క శ్యామ్, మంథని మండలం నాగారం మాజీ సర్పంచ్ బూడిద మల్లేష్, రియల్టర్ ఆసంపెల్లి శ్రీనివాస్ తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎవరికి వారుగా టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఏ పార్టీలో లేని విధంగా కాంగ్రెస్ పార్టీలోనే పార్లమెంట్ టికెట్ కోసం పోటీ పెరగడం గమనార్హం. నెలరోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులే గెలుపొందడం గమనార్హం. ఈ నియోజకవర్గం నుంచి చివరగా 2009లో గడ్డం వివేక్ గెలుపొందారు. 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. పదేళ్లుగా ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కరువయ్యింది.

● క్లీన్ స్వీప్ చేయడమే కారణం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ కావడంతో ఎంపీ స్థానాన్ని దక్కించుకోవాలని పార్టీ పట్టుదలతో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా గెలుచుకుంటుందనే స్థానాల్లో పెద్దపల్లి ఒకటి కావడం గమనార్హం. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలనే పట్టుదలతో పార్టీ నాయకులు ఉన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి అనూహ్యంగా తెరమీదకు వచ్చారు. ఆమె మంత్రి శ్రీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన తర్వాత పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 1998, 1999లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థిగా రెండు పర్యాయాలు ఆమె అప్పటి సిట్టింగ్ ఎంపీ గడ్డం వెంకటస్వామిపై అనూహ్య విజయం సాధించారు. మొదట 13 మాసాలు అధికారంలో ఉండగా, ఆ తర్వాత ఐదేళ్ల అధికారంలో ఉన్నారు. 2004 ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత ఆమె రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆమె తనకే టికెట్ వస్తుందని ఆశిస్తున్నారు. 2009లో బీఆర్ఎస్ ఎంపీగా పోటీ చేసిన గొమాసే శ్రీనివాస్ ఓటమి చెందగా, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2014, 2019లో ఆయన పార్టీ టికెట్ ఆశించినప్పటికీ దక్కలేదు. నియోజకవర్గంలో నేతకాని సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉన్నారని, అదే సామాజిక వర్గానికి చెందిన తనకే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. గడ్డం వివేక్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన గడ్డం వంశీకృష్ణ సైతం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సై అంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడుతున్నామని, పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీని వీడి వేరే పార్టీలోకి వెళ్లకుండా, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నామని, స్థానికంగా ఉండే తనకే టికెట్ ఇవ్వాలని ఊట్ల వరప్రసాద్, పార్టీ కోసం తాము కష్టపడుతున్నామని, పెర్క శ్యామ్, ఆసంపల్లి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీలో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న తనకే టికెట్ ఇవ్వాలని బూడిద మల్లేష్ కోరుతున్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జీ బాధ్యతలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అప్పగించారు. అభ్యర్థిని ఎంపిక చేయడంలో ఆయన పాత్ర కూడా కీలకమే. ఆయన ఆశీస్సుల కోసం ఆశావహులు పరితపిస్తున్నారు. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరగడంతో ఏ వర్గానికి చెందిన వారికి దక్కుతుందో వేచి చూడాల్సిందే.

పంచాయతీ ప్రత్యేక అధికారులుగా
గెజిటెడ్ అధికారులకే బాధ్యతలు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పెద్దపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 'ప్రత్యేక అధికారుల నియామకాల్లో గందరగోళం' అనే శీర్షికన ఈనెల 3వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. పంచాయతీ ప్రత్యేక అధికారులుగా గెజిటెడ్ అధికారులకే బాధ్యతలు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పలువురు జిల్లా అధికారులకు, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు అప్పగించిన వైనంపై వివరాలతో సహ ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమయ్యింది. దీనిపై స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీలు జిల్లా అధికారులు, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులను బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. దీంతో జిల్లాపంచాయతీ అధికారి వారిని తప్పించి మండల స్థాయి గెజిటెడ్ అధికారులకే బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫోరం బాధ్యులు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 3 : తెలంగాణ సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్ర ప్రతిభ పాటవ పరీక్ష నిర్వహించారు. సోషల్ టాలెంట్ టెస్ట్‌లో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు సంబంధించి 48 మంది విద్యార్థులు పరీక్షలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విజ్ఞాన ప్రతిష్టాన్ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, సోషల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రతంగపాణి రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు సాంఘిక శాస్త్రం ద్వారా స్ఫూర్తి పొంది దేశ అభివృద్ధిలో భాగస్వాములుకావాలని హితబోధ చేశారు. జిల్లాస్థాయి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్టులో ఈనెల 10వ తేదీన హాజరువుతారు. టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రతంగపాణిరెడ్డి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ షేక్ సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా బాధ్యులు మార రమేష్, గడ్డం రాజనర్సు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

పెద్దపల్లిటౌన్, జనవరి 3: వేతనాలు చెల్లించాలంటూ శనివారం మాత శిశు సంక్షేమ ఆస్పత్రి ఎదుట జిల్లా కేంద్ర ఆస్పత్రి, మాత శిశు ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి జ్యోతి పాల్గొని మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాతవారికి మూడు నెలలు, కొత్తవారికి తొమ్మిది నెలల నుంచి వేతనాలు లేక వారి కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం కాకపోవడంతో ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. కొత్త కాంట్రాక్టర్ వచ్చిన దగ్గర నుంచి కార్మికులకు వేతనాలు సకాలంలో అందడం లేదని వేతనాల గురించి ప్రశ్నిస్తే ఇష్టమైతే పనిచేయండి, ఇంటికి వెళ్లిపొమ్మని, వేతనాలు వచ్చినప్పుడు తీసుకోవాలని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రి అధికారులకు, డాక్టర్ ప్రణీత్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు చెల్లించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ నెర్వట్ల లక్ష్మి, పడాల పద్మ, లావణ్య, జ్యోతి, స్వరూప, భూలక్ష్మి, సంపత్, చంద్రయ్య, సతీష్, బబ్లు తదితరులు పాల్గొన్నారు

పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా పని చేయాలి

● కార్యకర్తలకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, ఫిబ్రవరి 3: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమష్టిగా పని చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ధర్మారంలోని గౌతమబుద్ధ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీ పథకాల అమలుతీరు ప్రక్రియను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తాను అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని.. ఏ సమస్య వచ్చిన పరిష్కారం చేస్తానని ఆయన భరోసా కల్పించారు. ధర్మపురి నియోజకవర్గంలో అన్ని మండలాల్లో తాగు, సాగు నీటికి శాశ్వత పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్తే సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, బొల్లి స్వామి, కాంపెల్లి రాజేశం, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, దేవి జనార్ధన్, చిప్ప మణిశర్మ, కొత్త నర్సింహం, పాలకుర్తి రాజేశం, గందం మహిపాల్, అజయ్‌పాల్‌రెడ్డి, మహిళా నాయకురాలు దేవి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 3: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరిండెంట్ రాబర్ట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, రాబోయే వేసవిలో ఎట్టి పరిస్థితుల్లో తాగునీటి ఇబ్బందులకు గురికాకుండా పకడ్బందీ కార్యాచరణ అమలుచేయాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు పదవీకాలం ముగిసినందున మళ్లీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారులతో పాలన సాగించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారికి గ్రామంపై సంపూర్ణ బాధ్యత, హక్కులు ఉంటాయని, ప్రత్యేక అధికారులు నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించుకొని, గ్రామపంచాయతీ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి గ్రామపంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలని సూచించారు. ఈనెల 7 నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని, ప్రజలను, యువతను, మహిళలను భాగస్వామ్యం చేస్తూ గ్రామాలను అద్దంలా తయారు చేయాలన్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే వచ్చే నష్టాలపై అవగాహన సైతం కల్పించాలని, డ్రైవ్ చివరిరోజు గ్రామసభ నిర్వహించాలని, పారిశుద్ధ కార్మికులకు సన్మానించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్వహించే జాతరలో సైతం ప్లాస్టిక్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకఅధికారులు తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని, మిషన్ భగీరథ కార్యక్రమం కింద ప్రతి గ్రామానికి తాగునీరు బల్క్ సరఫరా జరుగుతుందని, గ్రామంలో అంతర్గత సరఫరా బాధ్యతలను పంచాయతీకే అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి కోటి రూపాయలు నిధులు కేటాయించిందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద అధిక మొత్తంలో కూలీలకు పనిదొరికేలా చూడాలని, వర్కింగ్ సైట్‌లో ఉపాధి కూలీలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఉపాధిహామీ కింద మంజూరు చేసిన పనులను త్వరితగతిన గ్రౌండ్‌చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ప్రత్యేకఅధికారుల పాలన ప్రారంభమైన నేపథ్యంలో నూతన పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ విధి నిర్వహణ, విధానాలు వంటి అంశాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పిస్తూ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయాలని కలెక్టర్లకు సూచించారు. తాగునీటి సరఫరాకు సంబంధించి ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని, అవసరమైన చోట నీటి లీకేజీ మరమ్మతు పనులు, నీటి సరఫరా పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవో చంద్రమౌళి, డీఆర్‌డీపీ శ్రీధర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడారం భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

- ఖని బస్టాండ్‌లో అన్ని ఏర్పాట్లు చేయండి : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 3: ఈ నెల 21 నుంచి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు మేడారం వెళ్లే భక్తులకు బస్టాండ్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని గోదావరిఖని ఆర్‌టీసీ డీఎంను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదేశించారు. శనివారం గోదావరిఖని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను, బస్టాండ్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తాగు నీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, ప్రభు త్వం ఏర్పడిన తరువాత ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించుకోవడం జరిగిందన్నారు. జాతరకు గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి 120 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, గోలివాడ సమ్మక్క-సారలమ్మ జాతరకు 12 బస్సులు నడిపిస్తామన్నారు. అనంతరం బస్టాండ్‌లో సౌక ర్యాలపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట డీఎం నాగభూషణం, కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, శ్రీనివాస్, రంజిత్, మిడిదొడ్డి ప్రవీణ్, ఆర్‌టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: సుల్తానాబాద్ పట్టణంలోని అన్ని గృహాలు, దుకాణాలు, సంస్థల్లో శనివారం విద్యుత్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్‌ఈ సుదర్శన్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఇంజనీర్లు, డివిజనల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్‌ఇంజనీర్లు, సీనియర్, సీనియర్ అకౌంట్స్ అఫీసర్లు మొత్తం అధికారులు ఎనభై బృందాలుగా విడిపోయి పట్టణంలోని 6500 విద్యుత్ కనెక్షన్లకు సంబందించి తనిఖీలు నిర్వహించారని ఎస్‌ఈ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు.ఆయా కనెక్షన్లకు సంబంధించి లోడ్‌లను, మీటర్ల పనితీరును, ఇంటిలో, షాపుల్లో ఉన్న కనెక్షన్ లోడ్‌ను పరిశీలించి రాబోయే వేసవిలో లోడ్ సమస్య ట్రాన్స్‌ఫార్మర్లకు ఉత్పన్నం కాకుండా ఎక్కువ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి, అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు పరిశీలించామని పేర్కొన్నారు. ఇంటి కోసం కనెక్షన్ పొంది వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించడం జరిగిందన్నారు. కొత్త మీటర్లు కావాల్సిన వారు మీ సేవల్లో అప్లై చేసుకోవాలని సూచించారు.

మానసిక వేదనతో ఒకరి ఆత్మహత్య

కోల్‌సిటీ, ఫిబ్రవరి 3: గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌లో నివసముండే శ్రీపతి నరేష్(37) అనే వ్యక్తి మానసిక వేదనతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అతనికి భార్య జ్యోత్స్న, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేసిన నరేష్‌కు మానసిక స్థితి సరిగా లేక పోవడంతో ఎర్రగడ్డ మెంటల్ కేర్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కొన్ని రోజులుగా తాను చనిపోతానని అంటుండేవాడని, శనివారం ఉరి వేసుకున్నట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సమ్మయ్య పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3 : కరీంనగర్ గాంధీరోడ్ ప్రాంతంలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్న 8 మందిని ఒకటో టాణా పోలీసులు అరెస్టు చేశారు. ఒకటో టాణా ఎస్‌ఐ రవి ఆధ్వర్యంలో శనివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడిన 8 మంది వద్ద నుంచి 49,580 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

ఎలిగేడు, ఫిబ్రవరి 3: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధూళికట్ట గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు కట్కోజుల రామ్మూర్తి(55), కొడుకు సుబ్రమాణ్యం(25)లకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. తండ్రికొడుకులు కరీంనగర్ ఆసుపత్రికి వెళుతుండగా సుల్తాన్‌పూర్‌లో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు వారిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు. కాగా డెంగ్యూతో బాధపడుతున్న సుబ్రమాణ్యం ఆసుపత్రికి వెళుతున్న తరుణంలో ప్రమాదంలో గాయపడ్డారు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

తెలంగాణ ఎన్టీపీసీ 2వ యూనిట్ ట్రయల్ రన్ సక్సెస్

- 800 మెగావాట్ల ఫుల్ లోడ్‌కు చేరిక
- త్వరలో కమర్షియల్ ఆపరేషన్ ప్రకటన



ట్రయల్ రన్ సందర్భంగా ఈడీ, అధికారులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 3 : ఎన్టీపీసీకి చెందిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టిఎస్‌టిపిపి) స్టేజ్ 1 పూర్తి సామర్థ్యానికి చేరుకుంది. ప్రాజెక్టులోని 800 మెగావాట్ల 2వ యూనిట్‌కు నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. గత బుధవారం రాత్రి యూనిట్‌కు సంబంధించి ట్రయల్ రన్ చేయగా 72 గంటలపాటు కొనసాగిన ట్రయల్ రన్ సక్సెస్ అయింది. శనివారం రాత్రి 9.20 గంటలకు యూనిట్లో 800 మెగావాట్ల ఫుల్ లోడ్‌కు చేరుకుంది. ట్రయల్ రన్ చివరి దశను ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. యూనిట్ ఫుల్ లోడ్‌కు చేరుకోవడం, ట్రయల్ రన్ విజయవంతం కావడంతో ఈడీ కేదార్ రంజన్ టిఎస్‌టిపిపి అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఈడీ, అధికారులు ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో జీఎం సంజీవ్ కుమార్ సాహా, జీఎం జి.బి.సురేష్, జీఎం సంతోష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 3: మానకొండూర్‌లో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కనుకయ్య అతని తల్లితో కలిసి శనివారం వీణవంక మండలంలోని జంగంపల్లి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మానకొండూర్‌లో కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న కారు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నది. ప్రమాదంలో తల్లి, కుమారుడికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 3: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఓ ఆటో శుక్రవారం స్టాపర్ బోర్డును ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానిపేటకు చెందిన ఆటో డ్రైవర్ నరేష్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భవానిపేటకు చెందిన నరేష్‌గౌడ్ తన ఆటోను నడుపుతూ అక్కడ నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న క్రమంలో రోడ్డుపై ఉన్న స్టాపర్ బోర్డును అతివేగంగా ఢీకొట్టాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ముగ్గురు వ్యక్తుల బైండోవర్

ఎల్లారెడ్డిపేట ,ఫిబ్రవరి 3: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. మండలంలో ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి వేళలో గస్తీకాస్తున్న తమ పోలీస్ సిబ్బందికి బొప్పాపూర్, కోనరావుపేట గ్రామాలకు చెందిన బొమ్మన వేణి భరత్, బొండ్ల గణేష్, పని అఖిల్‌లు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకొని విచారించి తహసీల్దార్ రాంచంద్రం ఎదుట హాజరు పరిచామని చెప్పారు. రాత్రివేళలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై రమాకాంత్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

రుద్రంగి, ఫిబ్రవరి 3 రుద్రంగి మండల కేంద్రం శివారులోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద రెండు బైక్‌లు ఢీకోన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన గడ్డం లక్ష్మణ్ ఆనే వ్యక్తి పెట్రోల్ పంపు నుంచి బైక్‌పై బయటకు వస్తుండగా యూపి రాష్ట్రానికి చెందిన ఇద్దరు కూలీలు రుద్రంగి నుండి కోరుట్ల వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఎదురెదురుగా ఢీకొన్న సంఘనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 3: మండలంలోని సిర్సపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం శనివారం లభ్యమైనట్లు గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఓ గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొని వస్తుండటంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించారు. తనిఖీ చేయగా మృతుడు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఆర్.శశిధర్‌గౌడ్(40)గా గుర్తించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రమాదవశాత్తూ తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు సుద్దాల కొండయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కొండయ్య స్థానికులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆరుగురు మందుబాబులకు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3: సిరిసిల్ల పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురు మందుబాబులకు రెండు రోజులు జైలు శిక్షతో పాటు జరిమానా, మరో 9మందికి జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ శనివారం తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో గత 15రోజుల వ్యవధిలో పోలీసుల తనిఖీల్లో 15మంది మందుబాబులు పట్టుబడ్డారన్నారు. వీరికి కౌన్సిలింగ్ ఇచ్చి మరెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించామన్నారు. అనంతరం వీరిని కోర్టులో ప్రవేశపెట్టగా ఆరుగురు మందుబాబులకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 3వేల జరిమానా, మరో 9మందికి ఒక్కొక్కరికి రూ. 5వేల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారని తెలిపారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న గిరిజనులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 3: పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులపై గత ప్రభుత్వంలో అటవీశాఖ అధికారులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని లంబాడీల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నరేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గిరిజనులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనరావుపేట మండలం జైసేవాలాల్ తండాలో సుమారు 64 మంది గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. అక్రమ కేసుల్లో కోర్టుకు వెళ్లడానికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం సర్వే నిర్వహించి కొందరు గిరిజనులకు పట్టాలు ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడంతో గందరగోళం ఏర్పడి కేసుల వరకు వెళ్లిందన్నారు. ప్రజాపాలనంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన గిరిజనులకు పోడు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్య వేదిక, గిరిజన నాయకులు మధూకర్‌నాయక్, భూక్యా నాయక్, రంజీనాయక్, గిరిజన మహిళలు లక్ష్మీబాయ్, చాంకిబాయి, క్రైకాబాయి, కవిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటాలి

● డీవైఎస్‌వో కీర్తిరాజవీరు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు విశేష ప్రతిభ చాటి రాష్ట్ర చాంపియన్లుగా నిలవాలని డీవైఎస్‌వో కీర్తిరాజవీరు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా రగ్బీ జట్టు అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇటీవలి కాలంలో రగ్బీ క్రీడకు మంచి ఆదరణ లభిస్తుందని అన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు వివిధ క్రీడాంశాలలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడా పతాకాన్ని ఎగురవేస్తుండడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఈనెల 4,5 తేదీల్లో యాదాద్రి జిల్లా భువనగిరిలో జరుగబోయే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.చిరంజీవాచారి, రంగు నిరంజన్, గౌరవ అధ్యక్షుడు కొరిమి సంతోష్, పిఈటి శివ తదితరులు పాల్గొన్నారు.

ఒబులాపూర్‌లో చోరీ



బీరువా పగులగొట్టి చిందర వందర చేసిన వస్తువులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 3:తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ గ్రామంలో బత్తుల నర్సయ్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువా పగులగొట్టి రూ.30 వేల నగదుతో పాటు 60 తులాల వెండి అభరణాలతో పాటు 5 గ్రాములు బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

ముగిసిన త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



సంగీత కచేరి చేస్తున్న లత, తిరుమల బృందం



నాటిక ప్రదర్శన

వేములవాడ, ఫిబ్రవరి 3: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. చివరి రోజు ఉదయం ఎం.వి. సింహాచలశాస్త్రి భాగవతార్ హరికథ వినిపించగా, లత, తిరుమల, శ్రీలత, పద్మలత, వెన్నెల, మాలతి, వాణి సంగీత కచేరి నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీరాం భట్టార్ భాగవతార్ హరికథ గానం చేయగా, సాయంత్రం రాఘవేందర్ తబలపై సోలో కచేరీ నిర్వహించారు. అనంతరం హరిప్రియ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. రాత్రి ఎస్. శ్రీనివాస్ ఏకపాత్రాభినయం చేయగా, చివరగా శ్రీ లక్ష్మీనరసింహ నాట్యమండలి వారు శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

భూమిని రక్షిస్తేనే భవిష్యత్తు : ఈషా ఫౌండేషన్ ప్రతినిధి సుసాన్

వేములవాడ: భూమిని రక్షించుకుంటేనే మనందరికీ భవిష్యత్తు ఉంటుందని ఈషా ఫౌండేషన్ ప్రతినిధి, నెదర్లాండ్స్‌కు చెందిన సుసాన్ సమాధానం అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలకు శనివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం భూమిలో నేల సారం కోల్పోతున్న విషయం మనం గ్రహించలేకపోతున్నామన్నారు. భూమిని రక్షించడం, సారాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణప్రసాద్ అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- వేములవాడలో ప్రైవేట్ లాడ్జీలు, తనిఖీలు

వేములవాడ, ఫిబ్రవరి 3: ప్రైవేట్ లాడ్జిలు, అద్దె గదుల నిర్వాహకులు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని వేములవాడ పట్టణ సిఐ కరుణాకర్ అన్నారు. శనివారం వేములవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో కలిసి ఆయన ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గదులు అద్దెకు ఇచ్చే సమయంలో కచ్చితంగా ఫొటో గుర్తింపు కార్డు కలిగివున్న ఆధార్ ఇతరత్రా వాటిని జిరాక్స్ రూపంలో తీసుకొని నెలరోజుల వరకైనా భద్రపరచాలని చెప్పారు. రికార్డులో కూడా వారి పూర్తి వివరాలు సెల్ నెంబర్‌తో సహా నమోదు చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పని చేసేలా చూసుకోవాలన్నారు. వ్యాపార సముదాయాలు కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేయాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల లో సిఐలు కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, ఎస్సైలు ఉన్నారు.



అద్దె గదులను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేపు రేకుర్తిలో మెల్లకన్నుకు చికిత్స

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి 3: నగరంలోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో మెల్ల కన్నుకు చికిత్స కోసం 5వ తేదీ సోమవారం ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉంటారని రేకుర్తి ఆసుపత్రి ట్రస్టు సభ్యుడు కోల అన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మెల్లకన్ను, చిన్న పిల్లల్లో కంటి సమస్యలు, చిన్న పిల్లల్లో శుక్లం (మోతెబిందు) చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు సేవలు అందిస్తారన్నారు. హైదరాబాద్‌లో దొరికే సేవలు తక్కువ ఖర్చుతో కరీంనగర్‌లో పొందడానికి 7673983940 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1 బోధించుటకు రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ, పీజీ ఉత్తీర్ణత శాతం, బోధన అనుభవం నెట్/సెట్ అర్హత కలిగిన అభ్యర్థులను సోమవారం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో వారధిలో దరఖాస్తు చేసుకుని సోమవారం 5వ తేదీన నిర్వహించే రాత పరీక్షకు, డెమో, ఇంటర్వ్యూకు ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు.

కాంగ్రెస్ పాలన ఉన్నా.. లేకున్నా ఒక్కటే

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు

మల్యాల, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఉన్నా లేకున్నా ఒకటే అని గతంలో 56 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదని ఇప్పుడు కూడా న్యాయం చేయదు అని, ప్రజలు కూడా నమ్ముతున్నారని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సి.మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం విలేఖరులతో మాట్లాడారు. 50 రోజుల కాంగ్రెస్ పాలనలో 50 వేషాలు వేశారని ముందు రోజుల్లో కూడా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరుగదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వచ్చాకే రాష్ట్రంలో దేవాలయాలు అభివృద్ధికి నోచుకున్నాయని అందులో భాగంగానే కొండగట్టు అభివృద్ధికి రూ.100కోట్లు విడుదల చేయడంతో పాటు మరో 500 కోట్లు మంజూరు చేశారని ప్రస్తుత ప్రభుత్వం అవి విడుదల చేసి గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ 16 ఎంపీ స్థానాలు గెలుపొందాలని అంజన్నకు మొక్కుకున్నట్లు మల్లారెడ్డి తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీటీసీ రామ్మోహన్‌రావు, విండో చైర్మన్ సాగర్‌రావు, డైరెక్టర్ కొంక నర్సయ్య ఉన్నారు.

● అంజన్నకు పూజలు

కొండగట్టు అంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆలయ అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు శాలువాతో సత్కరించారు. అయితే ఆలయంలోకి మల్లారెడ్డి వచ్చినప్పుడు ఆయన వెంట గన్‌మెన్ ఆయుధంతో రావడం వివాదాస్పదంగా మారింది. గన్‌మెన్ ఆయుధంతో ఆలయంలోకి రావడం పట్ల ఆలయ సిబ్బందితో పాటు పలువురు వారించినప్పటికీ అలాగే ఉండడం పట్ల భక్తులు విస్మయం వ్యక్తం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు



ధర్మపురిలో భక్తుల క్యూలైను

మల్యాల, ఫిబ్రవరి 3: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధి శనివారం భక్తులతో కిక్కిరిసింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ఇరవై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్ ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి : ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

వీడని వృద్ధురాలి మిస్సింగ్ మిస్టరీ

● పదినెలలుగా కొనసాగుతున్న విచారణ



లింగవ్వ (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 3: ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన బత్తుల లింగవ్వ (63) అనే వృద్ధురాలు అదృశ్యమై పదినెలలు గడిచింది. గతేడాది మే 12వ తేదీన అదృశ్యమైనట్లు ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దీనిపై పదినెలలుగా విచారణ కొనసాగుతోంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరుకు చెందిన బత్తుల లింగవ్వ భర్త లింగయ్య రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించాడు. లింగవ్వకు సంతానం కాకపోవడంతో లింగయ్య రెండో పెళ్లి చేసుకోగా వారికి ఓ కూతురు ఉంది. అయితే రెండో భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. రెండో భార్య మరణించడానికి ముందే లింగయ్య తనకు వంశపారంపర్యంగా వచ్చిన 1.20 ఎకరాల భూమిని మొదటి భార్య లింగవ్వకు 20 గుంటలు, రెండో భార్యకు 20 గుంటలు, ఆయన పేరిట 20 గుంటలు మార్పిడి చేసుకున్నాడు. లింగయ్య తన 20 గుంటల భూమిని అవసరాల రీత్యా విక్రయించుకోగా రెండో భార్య పేరిట ఉన్న 20 గుంటలు ఆమె కూతురు పేరిట మార్పిడి జరిగింది. లింగవ్వ అదృశ్యానికి ముందు ఆమె పేరిట ఉన్న 20గుంటల భూమి రూ.15 లక్షలకు విక్రయ ఒప్పందం చేసుకుంది. ఈ విక్రయ ఒప్పందంలో భాగంగా రూ.2 లక్షలు అడ్వాన్సుగా తీసుకుంది. మిగతా డబ్బులు మరో మూడు రోజుల్లో తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఇంతలోనే లింగవ్వ అదృశ్యం కావడం స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లింగవ్వ అదృశ్యం విషయమై ఆమె అక్కలు ఎస్పీని కలిసి న్యాయం చేయాలని కోరారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుడు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి పోతన శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజేందర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని అన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది ఉమ్మడి జిల్లాల నుంచి 150 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాలల పీడీ అంతటి శంకరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, హరికిషన్, శ్రీలక్ష్మి, పూదరి రమేశ్, బి.రాజగోపాలాచారి, చిరంజీవి, వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన కోచ్‌మేనేజర్లు పాల్గొన్నారు.

బాల నేరస్తులను గుర్తించేందుకు జిల్లా జైలులో తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 3: పాన్ ఇండియా ప్రచారంలో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ శనివారం జిల్లా జైలును తనిఖీ చేశారు. 18 నుంచి 22 సంవత్సరాల వయస్సు కలిగిన విచారణ ఖైదీల జనన ధ్రువీకరణ పత్రాలను సేకరించి విచారించారు. ఈ సందర్భంగా 18 నుంచి 22 సంవత్సరాల వయసు కలిగిన విచారణ ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్యంలో సత్ప్రవర్తనతో మెదలాలని, నేరాలకు పాల్పడకుండా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు సూపరిండెంట్ సమ్మయ్య, జైలర్ శ్రీనివాస్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్‌లు పాల్గొన్నారు.

ఇండో-నేపాల్ కరాటే పోటీలు ప్రారంభం

● 20 రాష్ట్రాల క్రీడాకారుల హాజరు



మాట్లాడుతున్న జిల్లా కాయ్ చైర్మెన్ చల్ల హరిశంకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 3: గోజుర్యూ కరాటే డో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండో-నేపాల్ కరాటే పోటీలు శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఘణంగా ప్రారంభమయ్యాయి. నేపాల్‌తో పాటు మన దేశంలోని 20 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా(కాయ్)చైర్మెన్, రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. కరాటే రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల నిర్వాహకులు సురభి వేణుగోపాల్, సురభి అన్వేష్‌లు మాట్లాడుతూ నేపాల్ దేశంతోపాటు ఆదేశంలోని 20 రాష్ట్రం నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటనున్నారని అన్నారు. క్రీడాకారులకు పటాస్, కుమిటి, వెపన్, టీమ్‌కటాస్, అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, పోటీల చీఫ్ జ్యూరీ, నేపాల్ కరాటే ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ బీర్‌మిత్ర, గోజుర్యూ కరాటే ఫెడరేషన్ ఇండియా చీఫ్ నాగేశ్వర్‌రావు, కాయ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఈ శ్రీనివాస్, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు బి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర సభ్యులు కె వసంత్‌కుమార్, గోపు రాజిరెడ్డి, పుల్లూరి శ్రీనివాస్, వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన కరాటే మాస్టర్లు సత్యశంకర్, మొండయ్య, ప్రసన్న, శ్రీనివాస్, చందర్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై అధికారుల విచారణ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 3: చింతకుంట గురుకుల కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య ఘటనపై అధికారులు శనివారం విచారణ నిర్వహించారు. డిసిపిఓ శాంత, చైల్డ్ హెల్ప్‌లైన్1098 జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్‌లు జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు గురుకుల కళాశాలను సందర్శించారు. సోమవారం రాత్రి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ప్రిన్సిపాల్, అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. శనివారం కళాశాలలో విద్యార్థులు లేనందున మళ్లీ ఒకసారి కళాశాలను సందర్శించి విద్యార్థుల నుండి వివరాలు సేకరించి నివేదికను పైఅధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాస్మిన్ థెరిసా, బాలల పరిరక్షణ పథకం సోషనల్ వర్కర్ కవితదేవి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్, లెక్చరర్స్, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 3: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన అజీమ్‌పాషా (19) చెట్టుకు ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదవ తరగతి ఫెయిల్ కావడంతో కొంత కాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతూ వచ్చాడు. ఏం చేయాలో పాలుపోక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

గ్రామ స్వరాజ్య పునరుద్ధరణకు పాటుపడాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 3: గాంధీ చెప్పిన గ్రామస్వరాజ్య పునరుద్ధరణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కవి, రచయిత ఏలేశ్వరం వెంకటేశ్ అన్నారు. శనివారం గోదావరిఖనిలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో గాంధీ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. సత్యం, అహింస విధానాలతో ఉద్యమం కొనసాగించడానికి గాంధీ మార్గాన్ని ఆనాడు ప్రజలు అనుసరించారన్నారు. ఈ కార్యక్రమంలో దయానంద్ గాంధీ, యాదవ రాజు, అందె సదానందం, ప్రకాష్‌రెడ్డి, నారాయణ, రమేష్ పాల్గొన్నారు.

సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 3: గోదావరిఖని సదాశయ ఫౌండేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా యోగా శిక్షకురాలు అన్నపూర్ణ, ఎల్ఐసీ ఏజెంట్ బోళ్ల చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షురాలిగా ప్రధానోపాధ్యాయురాలు సూర్యదేవర జ్యోతి ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి లింగమూర్తి ప్రకటించారు. సంయుక్త కార్యదర్శిగా టి.రాములు, ఉపాధ్యక్షురాలిగా ఏఎస్ఐ శారద, కార్యనిర్వాహక ఉపాధ్యక్షురాలిగా శశికళ, ఆర్ఎంపీ సత్యం, లక్ష్మీనారాయణలను ఎన్నికయ్యారు. ఫౌండేషన్ ముఖ్యసలహాదారుడు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, రాష్ట్ర ప్రతినిధి కెఎస్ వాసు, నారాయణ సుందర్, దూడెం వాణి పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు

గోదావరిఖని, ఫిబ్రవరి 3: రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు పెద్దపల్లి స్థానం కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలంటూ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ కార్యదర్శి అల్లం భాస్కర్‌కు దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఆయన వెంట టీపీసీసీ కార్యదర్శి కాల్వ లింగస్వామి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాయమల్లు గౌడ్, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి నాయిని ఓదెలు, బొమ్మక రాజేష్, చుక్కల శ్రీనివాస్, గుంపుల తిరుపతి, బూర్ల శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పరచుకొని చదవాలి

అంతర్గాం, ఫిబ్రవరి 3: విద్యార్థులు ముందు నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పరచుకొని చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం మక్కాన్‌సింగ్ రామగుండం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి సౌకర్యాలను, వసతులు, మధ్యాహ్న భోజన అమలుతీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి మాట్లాడారు. పాఠశాలను అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకువస్తానని పేర్కొన్నారు. కార్పొరేటర్ అమ్రిన్ ఫాతిమాసలీంబేగ్, మాజీ కౌన్సిలర్ ఇసంపల్లి అంజులు, నాయకులు సిరిశెట్టి సతీష్‌గౌడ్, అష్రఫ్‌ఖాన్, శేఖర్, తార పాల్గొన్నారు.

గ్రామ ప్రత్యేక అధికారుల మార్పు

జూలపల్లి, ఫిబ్రవరి 3: గ్రామ ప్రత్యేక అధికారుల నియామకంలో మార్పులు చేస్తూ కలెక్టర్ ఆదేశాలిచ్చారు. కాచాపూర్ అబ్బాపూర్ గ్రామాలకు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, కీచులాటపల్లి బాల్‌రాజ్‌పల్లికి మండల వ్యవసాయ అధికారి ప్రత్యూష, తేలుకుంట, చీమలపేటకు తహసీల్దార్ బషీరుద్దీన్, జూలపల్లికి ఫారెస్టు రేంజ్ అధికారి నాగయ్య, కోనరావుపేట్‌కు నాయబ్ తహసీల్దార్ అబుబాకర్, కుమ్మరికుంటకు పశువైద్యాధికారి అజారొద్దిన్, నాగులపల్లి, పెద్దాపూర్‌కు ఎంపీవో కిరణ్, వెంకట్రావుపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువిశాల, వడుకాపూర్ ఏడిఏ శ్రీనాథ్‌లను నియమిస్తూ ఆదేశాలు జారిచేశారు.

మాజీ సర్పంచ్‌లకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 3: మండలంలోని పలు గ్రామాల్లోని మాజీ సర్పంచ్‌లను గ్రామస్థులు సన్మానించారు.కాల్వశ్రీరాంపూర్ గ్రామపంచాయతీకి లక్ష రూపాయల విలువైన ఫర్నీచర్‌ను విరాళంగా అందజేసిన స్వాతంత్ర్య సమర యోధులు ఎరబాటి రాజేశ్వర్‌రావును కూడా సన్మానించారు. జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, వైస్‌ఎంపీపీ జూకంటి శిరీషఅనీల్, ఎంపీడీఓ రాంమోహనచారి, ఎంపీఓ గోవర్ధన్, ఏఎన్ఎం సరోజన, గ్రామ కార్యదర్శులు, ఆశాలు పాల్గొన్నారు.

జూలపల్లి, ఫిబ్రవరి 3: జూలపల్లి మాజీ సర్పంచు దారబోయిన నర్సింహ యాదవ్ సేవలను గుర్తిస్తూ శనివారం అదే గ్రామానికి చెందిన మాదిగ సామాజికవర్గానికి చెందిన నాయకులు ఎస్సీ కాలనీలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి నర్సింహాయాదవ్‌ను ఘనంగా సన్మానించారు. మానుమండ్ల శ్రీనివాస్, మానుమండ్ల సంపత్, నెరువట్ల హన్మయ్య, మోదుంపల్లి బుచ్చయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ముత్తారం, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గసిగంటి దేవేందర్, హెచ్ఎం సుహాసిని, రాష్ట్ర కౌన్సిలర్ చేగొండ రాజ్ కుమార్, ప్రధానకార్యదర్శి కట్టాదాస్, మండల నాయకులు రవి నాయక్, కృష్ణమూర్తి, రాజు, భాస్కర్, స్రవంతి ఉన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంథని, ఫిబ్రవరి 3: జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో మండలంలోని ఆరెంద జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఏ. అశ్విని, జే. అభిషేక్, ఎం. వైష్ణవిలు ప్రతిభను చాటి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం కానుగంటి శ్రీనివాస్ శనివారం తెలిపారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పాలకుర్తి, ఫిబ్రవరి 3: మండలంలోని ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ హైస్కూల్ విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్, హెచ్ఎం సయ్యద్ అఫ్జల్ అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 3 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ కృష్ణ సూచించారు. స్థానిక ట్రినిటీ డిగ్రీ కాలేజీలో శనివారం సైబర్ నేరాలు, షీటీమ్స్ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. మహిళల రక్షణకు షీటీమ్స్ అందుబాటులో ఉన్నాయని, సమస్యలు తలెత్తినప్పుడు 100డయల్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై మల్లేష్, సిబ్బంది ఉన్నారు.

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బసంత్ నగర్ ఎస్ఐ వెంకటేష్ అన్నారు. శనివారం మండలంలోని అప్పన్నపేట గ్రామ ఆటో స్టాండ్ వద్ద డ్రైవర్లు, రైతులు, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'జడ్పీ చైర్మన్ మాట్లాడినవన్నీ అబద్ధాలే..'

మంథని, ఫిబ్రవరి 3: మంథనిలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడినవన్నీ అబద్ధాలేనని, వాటిని కాంగ్రెస్ పార్టీపక్షాన ఖండిస్తున్నామని డీసీసీ అధికార ప్రతినిధి ఇనుముల సతీష్ అన్నారు. శనివారం ఎంపీపీ కొండ శంకర్ కలిసితో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అక్రమంగా కోట్ల ఆస్తులు కూడబెట్టుకొని, భూములు సేకరించి హత్య రాజకీయాలు చేసిన వారికి ప్రాణభయం రావడం శోచనీయమన్నారు. విశ్వాసం కోల్పోయిన జడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం పెడితే తప్పేంటన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌పైన విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరి అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టారన్నారు. మంథని నియోజకవర్గంలో హత్యా రాజకీయాలు, దౌర్జన్యం చేస్తూ ప్రజలను, ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేసిన పుట్ట మధుకు గన్‌మన్‌లు ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీపతి బానయ్య, వీకే రవి, చొప్పకట్ల హనుమంతరావులు పాల్గొన్నారు.

సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి డి.హేమంత్ కుమార్ - క్యాన్సర్ వ్యాధిపై అవగాహన


సదస్సుల్లో మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్


సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను పరామర్శిస్తున్న జడ్జి ప్రియాంక

పెద్దపల్లిటౌన్, జనవరి 3: సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని, క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డి.హేమంత్ కుమార్ సూచించారు. శనివారం పెద్దపల్లిలోని ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న హేమంత్ కుమార్ మాట్లాడారు. క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోందని, వ్యాధి నియంత్రణకు పాటించాల్సిన నియమాలు తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, పెద్దపల్లి డీసీపీ ఎం చేతన, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మధుకర్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్, శంకర్, సంకీర్తన, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్, పెద్దపల్లి సీఐ కృష్ణ, మల్లేష్, శ్రీపతి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి..

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 3: విద్యాసంస్థల్లో, ఆరుబయట ప్రాంతాల్లో విద్యార్థులు అపరిచితుల పట్ల నిత్యం అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోదావరిఖని పరుశురాంనగర్‌లోని మార్గదర్శి హైస్కూల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. అపరిచితులు, బంధువుల రూపంలో ఉన్న వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులుమేడ చక్రపాణి, న్యాయవాదులు గుడికందుల భూమయ్య, ప్రవీణ్‌కుమార్, కాదాసి శేఖర్, మాట్ల భానుకృష్ణ, వరలక్ష్మి, లీగల్ సోషల్ వాలంటీర్ ఎం.శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, లీగల్ వాలంటీర్ సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరిగేలా చూడాలి..

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా డాక్టర్లు వైద్యం అందించాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి జీఎస్ఎల్ ప్రియాంక అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని జడ్జి శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న వేద్య సేవలు, రోగులు, డాక్టర్లను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలకు నమ్మకం కలిగే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలు కూడా ప్రభుత్వ ఆసుపత్రులపై అపనమ్మకం విడనా డాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జడ్జి వెంట ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ రమాదేవి తదితరులు ఉన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం


చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన కౌన్సిలర్లు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునితపై ప్రకటించిన అవిశ్వాసం నెగ్గింది. అవిశ్వాసానికి 12 మంది కౌన్సిలర్లు మద్దతు తెలుపడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్ ముత్యం సునిత పదవిని కోల్పోయారు. గత ఏడాదిలోనే మెజారిటీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ ఉన్నతాధికారులకు నోటీసులు ఇచ్చారు. అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చొరవతో అది కార్యరూపం దాల్చలేదు. గత నెలలో 12 మంది కౌన్సిలర్లు సంతకాలు చేస్తూ మరోసారి అవిశ్వాసం నోటీసును అదనపు కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పెద్దపల్లి ఆర్‌డీవో మధుమోహన్ అధ్యక్షతన మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఉదయం 11గంటలకు నిర్వహించారు. సభ్యులు ఇచ్చిన అవిశ్వాసం నోటీసుకు అనుకూలంగా హాజరైన 12మంది మద్దతు తెలిపారు. దాంతో చైర్ పర్సన్ పదవి కోల్పోయారని ఆర్డీవో ప్రకటించారు. చైర్‌పర్సన్‌గా మరొకరిని ఎన్నుకోవడానికి ప్రభుత్వం ద్వారా నోటిఫికేషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని, అంతవరకు ప్రస్తుత మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమత ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తారని ప్రకటించారు. అవిశ్వాసానికి అనుకూలంగా చేతులు ఎత్తిన వారిలో బీఆర్ఎస్‌కు చెందిన గాజుల లక్ష్మి, పసెడ్ల మమత, కూకట్ల గోపి, గుర్రాల శ్రీనివాస్, అనుమాల అరుణ,రేవెల్లి తిరుపతి, గొట్టం లక్ష్మి, కాంగ్రెస్‌కు చెందిన బిరుదు సమత, నిషాత్, రాజయ్య, వరప్రదీప్, సునిత ఉన్నారు. సమావేశం సందర్భంగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. కమిషనర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను పరిరక్షించుకోవాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 3: మానేరు పరివాహక గ్రామాల్లోని సహజవనరులు, ప్రకృతి సంపదను పరిరక్షించుకోవాలని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. మండలంలోని కదంబాపూర్‌లో గ్రంథాలయం, తొమ్మిది కుల సంఘాల భవనాల, షాదీఖానాలను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సభలో మాట్లాడారు. కదంబాపూర్‌తో పాటు మానేరు పరివాహక ప్రాంత గ్రామాలలోని ఇసుకను కాపాడుకోవాలని వాటిని స్థానిక అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు.ఎమ్మెల్యేను సర్పంచ్ తోపాటు గ్రామంలోని అన్ని కులసంఘాల వారు, ప్రముఖులు సన్మానించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాష్ రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సుమన్, దామోదర్‌రావు, శ్రీనివాస్‌రావు, సురేష్‌రెడ్డి, రాజు, అమర్, వార్డు సభ్యులు, కుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు


కదంబాపూర్‌లో షాదీఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విద్యా సంస్థల్లో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రదర్శన


కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 3: గోదావరిఖని అడ్డగుంటపల్లిల్లోని కృష్ణవేణి విద్యాసంస్థలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ డే, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు తీసుకువచ్చిన ఆహారపదార్థాల ప్రదర్శనను, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని క్రీసెంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోని విద్యార్థులు తయారుచేసిన రకరకాల వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల చైర్మన్ ఎంఏ ఆయాజ్, సింగిల్‌విండో సొసైటీ మండల ఉపాధ్యక్షుడు కామెడీ సంధ్య వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నసీర్, మాజీ సర్పంచ్‌లు మాదాసి సతీష్, ఆరెల్లి సుజాతరమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఓబీ తొలగింపు వేగవంతం చేయండి


సమీక్ష సమావేశంలో పాల్గొన్న జీఎం, ఆర్‌జీ-1 అధికారులు

గోదావరిఖని, ఫిబ్రవరి 3: సింగరేణి ఓసీపీ గనుల్లో ఓబీ వెలికితీత పనులను వేగవంత చేయాలని సింగరేణి సీఎండీ బలరాంనాయక్ అన్ని ఏరియాల జీఎంలకు సూచించారు. శనివారం జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ఓసీపీల నుంచి ఓబీని వెలికితీసే ప్రక్రియ వేగవంతం చేయాలని, వర్షాకాలం రాకముందే ఓబీని ఎక్కువ తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే ఓసీపీ-5లో జరుగుతున్న పనులను జీఎం చింతల శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓబీ తొలగింపులో కాంట్రాక్టర్లు కీలక పాత్ర వహించాలని, రక్షణ సూత్రాలను పాటిస్తూ బొగ్గును వెలికితీసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ప్రాజెక్టు ఆఫీసర్ చంద్రశేఖర్, ఎన్విరాన్‌మెంట్ డీజీఎం ఆంజనేయ ప్రసాద్, పీసీ పటేల్ కంపెనీ మేనేజర్లు రవీందర్, మనీష్ పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 3: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే ఒకరోజు దేశ వ్యాప్త సమ్మెను సింగరేణి కార్మికులు విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి సత్యనారాయణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ కృష్ణ, విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సమ్మెలో సింగరేణి కార్మికులు కూడా పాల్గొనాలని సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కనీసం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్‌ను రూ.10వేలకు పెంచాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని, ఇన్‌కంటాక్స్ రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులతోనే లాభాలు వస్తున్నాయని చెబుతున్న యాజమాన్యం వారికి కూడా లాభాల వాటా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదే విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజేషన్ చేసినట్లు సింగరేణిలో కూడా 240మస్టర్లు నిండిన వారిని రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఐదు కొత్త గనులను ప్రారంభించాలని, పరుగుపందెం ద్వారా ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపట్టాలని, సింగరేణి ఉద్యోగానికి ఎలాంటి విద్యార్హత అవసరం లేదన్నారు. ఈనెల 16న జరిగే ఒక రోజు సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదరహిత గనులుగా తీర్చిదిద్దాలి

కాసిపేట, ఫిబ్రవరి 3: ప్రమాదరహిత గనులుగా తీర్చిదిద్దడంలో కార్మికులు భాగస్వాములు కావాలని రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా అన్నారు. శనివారం కాసిపేట గనిపై గని అధికారులకు సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పనిస్థలాలను పరిశీలిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కేకే గ్రూపు ఏజెంటు రాందాస్, ఏఐటీయూసీ పిట్‌సెక్రెటరీ మీనుగు లక్ష్మీనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం మండల వాసవి క్లబ్ కమిటీ నియామకం

ధర్మారం, ఫిబ్రవరి3: ధర్మారం మండల వాసవి క్లబ్ నూతన కమిటీ నియమించినట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గోల్డెన్ స్టార్ సిరిపురం సత్యనారాయణ ప్రకటించారు. శనివారం ధర్మారంలో మండల వాసవి క్లబ్ నూతన కమిటీ ఎన్నికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నూతన కమిటీని నియమిస్తున్నట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గోల్డెన్ స్టార్ సిరిపురం సత్యనారాయణ ప్రకటించారు. అధ్యక్షుడిగా తాటిపల్లి వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్యాల శివ, కోశాధికారిగా ఈగం ప్రసాద్‌లను నియమించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బీరెల్లి రామ్మోహన్, ఎలగందుల అశోక్, కొల్లూరు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎలిగేడు, ఫిబ్రవరి3: మండలంలోని శివపల్లి గ్రామంలో శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావును తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మంద భాస్కర్, జిల్లా అధ్యక్షుడు గర్రెపల్లి రాజేశం, అధికార ప్రతినిధి చిప్పకుర్తి శంకర్, ఉపాధ్యక్షుడు బొమ్మన వెంకటేశం, జనగామ రవి, దేవరకొండ అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు

ఓదెల, ఫిబ్రవరి 3: మండలంలోని కొలనూర్ హైస్కూల్‌లో శనివారం కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి దేవిసింగ్ మాట్లాడుతూ వ్యాధి ప్రాథమిక దశలో గుర్తించి ముందు జాగ్రత్త పడితే కుష్ఠును నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఏసుదాసు, మోహన్, సిహెచ్ఓ ఇందిరాకుమారి, హెచ్ఓ సుధాకర్, ఉపాధ్యాయులు లక్ష్మీ, నిర్మల, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 3: మండలంలోని హన్మంతునిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం లయన్స్ క్లబ్ ఎలైట్, కరీంనగర్ దీప్తి స్కిన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉచితంగా పరిక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి అశోక్ కుమార్, వేల్పురి సంపత్ రావు, ప్రెసిడెంట్ బిక్షపతి , ట్రెజరర్ అతిఫ్, కంకటి శ్రీనివాస్ ,మెడగొని శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథం ,చంద్రకళ ఇతర ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మక్క జాతర చైర్మన్‌గా ఇంద్రారెడ్డి

ఓదెల, ఫిబ్రవరి 3: ఓదెల మండలం మడకలో నిర్వహించే సమ్మక్క, సారలమ్మ జాతర కమిటీ ఎన్నికలను శనివారం గ్రామ కార్యదర్శి సమక్షంలో నిర్వహించారు. జాతర కమిటీ చైర్మన్‌గా నోముల ఇంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదే గ్రామానికి చెందిన మరో 28 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. మండలంలోని భక్తులు జాతరకు తరలి వచ్చి మొక్కులు తీర్చుకోవాలని చైర్మన్ కోరారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామాలయ కమిటీ చైర్మన్‌గా వనంరాంచందర్‌రావు

రామగిరి, ఫిబ్రవరి 3: మండలంలోని శ్రీకోదండరామాలయం, షిర్డి సాయి ఆలయాల నూతన కమిటికి చైర్మన్‌గా వనంరాంచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ అధ్యక్షుడిగా గంటవెంకటరమణరెడ్డి, ఉపాధ్యక్షులుగా కాటంసత్యం, తిప్పర్తి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి రవీందర్, సహాయ కార్యదర్శిగా కొరుకొప్పుల తులసిరామ్‌గౌడ్, కోశాధికారిగా ఎలిశెట్టి విశ్వేశ్వర్‌లను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటికి ఎంపీపీ ఆరెల్లిదేవక్క శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు చిందంమహేష్, కొట్టేసందిప్, తీగల స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, జనవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని, ఇందుకు కాంగ్రెస్ నాయకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కూడా అందరినీ పార్టీలకతీతంగా గౌరవించాన్నారు. కొంతమంది విచ్చలవిడిగా మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు వారి ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. ఈనెల 5న రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పెద్దపల్లి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని, సమావేశానికి మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ హాజరవుతారన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గంట రాములు, మర్కు లక్ష్మణ్, బండారి శ్రీనివాస్, ఉప్పు రాజ్‌కుమార్, కాశిపాక వాసు తదితరలున్నారు.

భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం ఆవిర్భావ వేడుక

రామగిరి, ఫిబ్రవరి 3: భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం ఆవిర్భావ వేడుకను శనివారం మండలంలోని కల్వచర్లలోని కార్యాలయంలో సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి ముఖ్యఅతిథిగా హజరై కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, భైరిశంకర్, షరీఫ్, లక్ష్మీనారయణ, మల్లేశం, శంకర్, సుధాకర్, సతీష్, మల్లేష్, కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంథని, ఫిబ్రవరి 3: మంథని శ్రీగౌతమేశ్వరస్వామి ఆలయ కమిటీ ఏర్పాటు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంథని ఈవో రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి ఐదుగురు సభ్యులతో కూడిన ట్రస్ట్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు సూచించిన ఫార్మాట్‌లో తమ దరఖాస్తులను ఎండోమెంట్ డిప్యూటీ కమిషన్‌కు పంపించాలని సూచించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

పాలకుర్తి, ఫిబ్రవరి3: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెని పర్మినెంటు యూనియన్ అధ్యక్షుడు బయ్యాపు మనోహర్ రెడ్డి అన్నారు. కర్మాగారంలో పర్మినెంటు కార్మికులుగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంపెనీ అధికారులు గోవిందా రావు, శ్యామ్ సుందర్, రాజేందర్, యుగెందర్ రాజు, గౌస్ పాషా, శ్రీనివాస్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంటు పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి దాడి మహేష్, పోతుల ప్రసాద్, గుంపుల శంకర్, దేవి శ్రీను, పుప్పాల రమేష్, ఏదునూరి నారాయణ, శ్రీనివాస్, దామోదర్, విశ్వనాథం, నగునూరి రమేష్, కమిటి సభ్యులు, తోటి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన

జూలపల్లి, ఫిబ్రవరి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక మోటివేషన్ తరగతులను జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎండి షేక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంపీవో కిరన్, మానిటరింగ్, ఎస్ఏలు క్రిష్ణమోహన్, నరేష్, మంజులా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.